TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :154 prajadivvs57@gmail. com శనివారం 25 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

# ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు సఫలం

**నేడు ఉదయం నుంచి యథావిధిగా బస్సు సర్వీసులు**

**సమ్మె విరమించేందుకు కార్మిక సంఘాల అంగీకారం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన భేటీ**

**అధికారికంగా వెలువడనున్న ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆర్టీసీ సమ్మెపై కాసేపట్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచి ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. మంత్రుల బృందం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య దాదాపు 12 గంటల పాటు చర్చలు జరిగాయి. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లపై ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. 10 శాతం పీఆర్సీ, ప్రభుత్వంలో విలీనం, ఆర్టీసీ సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ యాజమాన్యం సమ్మతించింది.




# చావుకు దగ్గరవుతున్న చంద్రబాబు

## జీవిత చరమాంకంలోనైనా మంచి పనులు చేయాలని సూచన

**సీఎంగా చంద్రబాబు నెలకు వేల కోట్ల లంచాన్ని స్వీకరిస్తున్నారని**

**ఆరోపణలు సంపాదించిన సొమ్మును విదేశాల్లో కూడబెడుతున్నారని వ్యాఖ్యలు**

**జులైలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నా: ఈడీ సోదాల అనంతరం విజయసాయి సంచలన ప్రకటన**



జులైలో మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తానన్న విజయసాయి త్వరలోనే మీడియా రంగంలోకి కూడా అడుగుపెడతానని వెల్లడించారు. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారని, ఏపీలో మరో కొత్త రాజకీయ పార్టీ అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తపరిచారు. తన నివాసంలో ఈడీ సోదాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంట్లో తన అమ్మ ఆరోగ్యం కోసం ఉంచిన ఆరు లక్షల నగదు తప్ప మరి ఏమి దొరకలేదని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు పై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వయసు పెరగడంతో చావుకు దగ్గరైన ముఖ్యమంత్రి చంద్రబాబు జీవిత చరమాంకంలోనైనా మంచి పనులు చేయాలని సూచించారు. చంద్రబాబు ప్రతినెల 5 వేల కోట్ల సొమ్మును లంచంగా స్వీకరిస్తున్నారని ఈ ధనం మొత్తాన్ని విదేశాల్లో దాచుకుంటాడని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు ఏ మేరకు సంపాదించారన్నది ప్రజలు ఊహించుకోవచ్చు అని విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. వచ్చే జులై నెల నుంచి తాను మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో భాగంగా తన నివాసంలో ఈడీ సోదాలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లోకి పునరాగమనం చేయడమే కాకుండా, ..మిగతా 2లో



# కిల్లర్ పార్టీ నేతలు కొత్త ఎత్తుగడలు

**వారి వ్యూహాలకు తగ్గట్లుగా ఉండాల్సిందే**

**ఎంతటి దారుణాలకైనా తెగించేస్తున్నారు**

**క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ అధినేత చంద్రబాబు**

వైసిపి రాజకీయ కుట్రలతో అప్రమత్తంగా ఉండాలని టిడిపి శ్రేణులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికపడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. పార్టీ సిద్ధాంతాలు, ..మిగతా 2లో

# మిలీనియం మార్చ్ కేసులో కెసిఆర్‌పై కేసు కొట్టివేత

హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు ..మిగతా 2లో





# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**

ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లికమేనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని ..మిగతా 2లో

## బెంగాల్‌లో జంగిల్ రాజ్ ఖేల్ ఖతం

**భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక**

**ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు** 2

## 13 జిల్లాల్లో... ప్రారంభం కాని

# ధాన్యం కొనుగోళ్ళు



**90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం**

**8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**ఇప్పటికైతే ఐదు వేల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల పక్రియపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల ..మిగతా 2లో





## ఆర్టీసీ సమ్మెకు

# బలైన శంకర్‌గౌడ్

**ఆర్టీసీ కార్మికులు వివిధ పక్షాల నేతల మధ్య అంత్యక్రియలు పూర్తి**

ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం ..మిగతా 2లో

# బిజెపిలో చేరుతున్న ఆమ్‌ఆద్మీ ఎంపీలు

**పార్టీ మారుతున్న రాజ్యసభ ఎంపీలలో రాఘవ్ చద్దా, అశోక కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్**



2




## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా

# శిఖాగోయల్

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి** 2

**ఏడుగురు ఐపిఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం**

## నర్సంపేటలో..... రోడ్డుపై బైఠాయించిన

# బండి సంజయ్ 2

**శంకర్ గౌడ్ మృత దేహాన్ని డిపోకు తరలించాలని పోలీసులతో వాగ్వివాదం**

**బిఆర్ఎస్ చేసిన తప్పులనే చేస్తున్న కాంగ్రెస్.. కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

# చావుకు దగ్గరవుతున్న చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి...

త్వరలోనే మీడియా రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీపై విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతకుముందు తన నివాసంలో జరిగిన ఈడీ సోదాలపై ఆయన స్పందించారు. అధికారుల సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని, తన వద్ద ఏమీ దొరకలేదని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. అయితే, ఈడీ తనను విచారణకు పిలిచే అవకాశం ఉందని అన్నారు.

**లిక్కర్ కేసుతో నాకు సంబంధమే లేదు.. అయినా ఏ5గా చేర్చారు**

లిక్కర్ స్కామ్ కేసులో తనపై వస్తున్న ఆరోపణలను వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ కుంభకోణంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తన పేరును ఈ కేసులోకి లాగారని ధ్వజమెత్తారు. కేసులో తనను ఏ5 నిందితుడిగా చేర్చి తన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతున్న కుట్ర అని విమర్శించారు. రాజకీయాల్లో కుట్రలు కుతంత్రాలు చేసే వారిని చరిత్ర ఎన్నటికీ క్షమించదని విజయసాయి రెడ్డి హెచ్చరించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను వేధించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. కుట్రపూరిత రాజకీయాలు చేసినంత కాలం ప్రజలు గమనిస్తూనే ఉంటారని అటువంటి వారిని కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. తన క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇవన్నీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వనాశనం కావడానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాన కారకుడని ఆయన ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ తన స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు పని చేస్తున్నారని విమర్శించారు. ఏపీ పతనం వెనుక ఉన్న శక్తుల గురించి ప్రజలందరికీ తెలుసని చెప్పారు. తనపై ఎన్ని దాడులు జరిగినా ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని విజయసాయి రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.పరిపాలనలో పారదర్శకత లేకపోవడం వల్లనే రాష్ట్రం వెనుకబడిందని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం సరికాదని హితవు పలికారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందని తనపై జరిగిన సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అన్ని విషయాలు బయటకు వస్తాయని చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన వెల్లడించారు.

# నేడు కవిత కొత్త పార్టీ

మొదటి పేజీ తరువాయి...

పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు : ముగ్గురు మృతి

కుకీ–నాగా తెగల మధ్య మణిపూర్‌లో ఘర్షణలు ఆగడం లేదు. తాజాగా ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో ముగ్గురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన మణిపూర్, ఉక్రుల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. మృతుల్లో ఇద్దరు కుకీ తెగకు చెందిన వారు కాగా, మరొకరు తంగ్‌కుల్ నాగా తెగకు చెందిన వారు. ద కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం ముల్లామ్, షోంగ్ఫల్ గ్రామాల్లో కుకీ తెగవారు ఉంటారు. వీరి ఇండ్లపై శుక్రవారం తెల్లవారుఝామున ఆయుధాలు కలిగిన నాగా తెగవారు దాడి చేశారు. ఈ దాడిలో కుకీ తెగకు చెందిన ఇద్దరు మరణించారు. పలువురు మహిళలు, పిల్లలు గాయపడ్డారు. వీరంతా నిద్రలో ఉండగా ఈ దాడి జరిగినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో కొన్ని ఇండ్లను కూడా దుండగులు తగులబెట్టారు. ఈ దాడుల్ని ఎదుర్కొనే క్రమంలో, తమ ప్రాణాల్ని రక్షించుకునేందుకు గ్రామస్తులు ఎదురుదాడికి దిగారు. ఈ దాడిలో నాగా తెగకు చెందిన ఒక వ్యక్తి మరణించాడు. అయితే, కుకీ తెగలవారు చేసిన ఈ ఆరోపణల్ని నాగా తెగ సెంట్రల్ కమాండ్ గార్డ్స్ ఖండించారు. తమ తెగకు చెందిన దళాలు గస్తీ విధులు నిర్వర్తిస్తుండగా.. కుకీ తెగకు చెందిన వారు దాడి చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. అక్కడకు వెళ్లిన తర్వాత కుకీ తెగవారు కాల్పులు జరపడంతో ఒక నాగా తెగ వాలంటీర్ మరణించాడని, మరో నలుగురికి గాయాలయ్యాయని చెప్పారు. దీంతో తాము కూడా ఎదురుకాల్పులు జరిపామన్నారు. ఈ ఘర్షణల నేపథ్యంలో భద్రతా బలగాలు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ఇక రెండు తెగల మధ్య చాలా కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి.

# నర్సంపేటలో..... రోడ్డుపై బైఠాయించిన బండి సంజయ్



ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. అనేక సంవత్సరాలు నర్సంపేట డిపోలో పనిచేసిన శంకర్ గౌడ్ మృతదేహాన్ని గేటు వద్ద నివాళులర్పించేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడానికి తీవ్రంగా తప్పు పట్టారు. ఈ విషయమై ఆయన రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తపరిచారు. ఈ క్రమంలో పోలీసులకు ఆర్టీసీ కార్మికుల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన తప్పే కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే.. ఓటు కాంగ్రెస్‌కు వేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది. ఆ డబ్బులు బఠానీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు' అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి హితవుపలికారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తెలంగాణ నుంచే డబ్బులు వెళ్తున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను ప్రధాని మోదీని అడిగి తయారు చేశారా అంటూ కాంగ్రెస్‌పై బండి సంజరు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

## ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

## ఏడుగురు ఐపిఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం

రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# మిలీనియం మార్చ్ కేసులో కెసిఆర్‌పై కేసు కొట్టివేత

మొదటి పేజీ తరువాయి...

వాదించారు. పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

మొదటి పేజీ తరువాయి...

జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. గురువారం ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

# బెంగాల్‌లో జంగిల్ రాజ్ ఖేల్ ఖతం

పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్, తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

# బిజెపిలో చేరుతున్న ఆమ్‌ఆద్మీ ఎంపీలు

ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇపడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక కుమార్ మిట్టల్, సందీప్ పాఠక మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇపడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తపకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇపడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని, తపడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నీ కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు.

# ఆర్టీసీ సమ్మెకు బలైన శంకర్‌గౌడ్


మొదటి పేజీ తరువాయి...

తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## కిల్లర్ పార్టీ నేతలు

# కొత్త ఎత్తుగడలు

మొదటి పేజీ తరువాయి...



సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల వంటి అంశాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశర చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ప్రస్తావించారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. వైసీపీ సోషల్ సైకోలతో తపడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎపడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు. 2019లో వైసీపీ గెలిచాక ఏపీలో అభివృద్ధి జరగలేదని ప్రస్తావించారు. తనను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాలను దాటి సామాన్య ప్రజలను కూడా జగన్ హయాంలో ఇబ్బందులకు గురి చేశారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. 2019–24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని అన్నారు. మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతో పాటు.. కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని.. పార్టీ కూడా కార్యకర్తలను అలాగే గౌరవిస్తోందని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిందని జగన్ రెడ్డి పరామర్శకు వెళ్తారని.శ్రీ కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారని కానీ తన కారు కింద పడిపోయిన కార్యకర్తను మాత్రం ఎందుకు పరామర్శించరని ప్రశ్నించారు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారని ఆరోపించారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూములను దోపిడీ చేశారని ఆగ్రహించారు. పంపకాల్లో విభేదాలు రావడంతో దస్తగిరి అనే వైసీపీ కార్యకర్తను చంపేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. వాళ్ల అనుచరులను వాళ్లే చంపుకుని నేరం తమపై నెట్టేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలయ్యేదాకా మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను వాడుకున్నారని అధికారంలోకి వచ్చాక న్యాయం చేయాలని జగన్ చెల్లెలు వైఎస్ సునీతారెడ్డి అడిగితే సైలెంట్‌గా ఉండమని ఆమెను కూడా బెదిరించారని ఆగ్రహించారు. ఆస్తి విషయంలో తల్లి, చెల్లిపై ఎవరైనా కోర్టుకు వెళ్తారా అని మండిపడ్డారు.

## 13 జిల్లాల్లో... ప్రారంభం కాని

# ధాన్యం కొనుగోళ్ళు

మొదటి పేజీ తరువాయి...

శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,గనాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు పక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్రస్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.అంతే గాకుండా ధాన్యం కొనుగోలుకు గాను కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లినర్లు,డ్రైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలిలను నియమించాలన్నారు. తూకం పక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్ల కుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం తరలి రాకుండా ఉండేలా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అయ్యే మొత్తాలను రైతులకు ఎప్పటికపడు చెల్లింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖా మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

# వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్, భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి

**- డీజీపీ బీ శివధర్ రెడ్డి**
**- రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి డీజీపీ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన**
**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



**వేములవాడ ప్రజాదివాస్ ఏప్రిల్ 24** రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిజం అంతమైందని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసింగ్ లో నూతన మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రగానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళు తున్నానని తెలిపారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా ఉంటున్నారని చెప్పారు.

### ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెలవుల్లో విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ తాను నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్‌లి కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మూడో బ్రిడ్జి పనులు చేయిస్తున్నామని, రుద్రంగికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు అయిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు.రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మినిస్టర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టమని పేర్కొన్నారు.

### నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం 10 గుంటల స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరిలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించామని తెలిపారు.

### రోడ్డు భద్రత అందరి బాధ్యత..

జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ూచీూ=) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల సేఫ్టీ కమిటీలకు తెలిపామని,ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని, సీపీఆర్, ప్రాథమిక ఆరోగ్య చికిత్స పై అవగాహన కల్పించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ అధికారులు సుందర్, రాజశేఖర్, వినేయ్ , సుదర్శన్,సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు







**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 24**వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం ఐపీఎస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్) సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు.తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో మహిళా భవనాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు









**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 24**
వేములవాడ మున్సిపల్ పరిధిలో గల తిప్పాపూర్ లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా సంఘాల భవన నిర్మాణ పనులకు మోక్షం లభించనుంది. శుక్రవారం పట్టణంలోని తిప్పాపూర్ ప్రాంతంలో గల 7, 8 వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సూచనల మేరకు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతంలో ఈ భవనాల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాల వల్ల మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో భవనాలు నిరుపయోగంగా మారి మహిళా సంఘాల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్లు ఎల్ల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ లతో కలిసి భవన నిర్మాణ పురోగతిని, మిగిలి ఉన్న పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకునా న్రు.వేములవాడ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ పర్యటన చేపట్టినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో ఈ భవనాల పూర్తికి అవసరమైన ప్రత్యేక నిధులను త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. నిధులు విడుదలైన వెంటనే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి వస్తే వారు సమావేశాలు ర్వహించుకోవడానికి, శిక్షణా కార్యక్రమాలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.తమ వార్డుల్లోని సమస్యను గుర్తించి భవనాలను పూర్తి చేసేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు, చైర్మన్ పుల్కం రాజుకు స్థానిక కౌన్సిలర్లు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ఎఇ అనన్య, మున్సిపల్ సిబ్బంది, నాయకులు మరియు మహిళా తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి మాటలు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు: విప్ అది శ్రీనివాస్ ఫైర్

**-బిఆర్ఎస్ లో చేరగానే జీవన్ రెడ్డి మాట మార్చారు..**
**కాళేశ్వరం అవినీతిపై వెనక్కి తగ్గేది లేదు**
**జీవన్ రెడ్డి తీరుపై అది శ్రీనివాస్ ధ్వజం.. కోర్టు తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు**




**రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ ఏప్రిల్ 24** మాజీ మంత్రి జీవన్ రెడ్డి తీరుపై రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి ఎవరి మెప్పు పొందడం కోసమే బిఆర్ఎస్ వత్తాసు పలుకుతూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ దోపిడీ చేశారని అన్న జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారం రోజులకే మాట మార్చడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు ఎక్కడా తప్పుపట్టలేదని, కేవలం సాంకేతిక కారణాలను మాత్రమే ప్రస్తావించిందని స్పష్టం చేశారు. తీర్పును సరిగ్గా చదవకుండా జీవన్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళలా చూసుకుంటూ పాలన సాగిస్తోందని అది శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. గతంలో సన్న బియ్యం పథకాన్ని మెచ్చుకున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు కోర్టు తీర్పు ఎలాంటి అడ్డంకి కాదని, త్వరలోనే ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేశారని, కేటీఆర్, హరీష్ రావులకు తోడై జీవన్ రెడ్డి ప్రజా పాలనను బద్నాం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నీటి నిల్వల్లో ఎలాంటి మార్పు లేదు.. మిడ్ మానేర్ అప్‌డేట్!

**బోయినీపల్లి మండలం/ ప్రజాదివాస్ ఏప్రిల్ 24** బోయిన్ పల్లి మండలం కొదురుపాక మిడ్ మానేర్ రిజర్వాయర్ నీటి నిల్వల తాజా వివరాలు విడుదలయ్యాయి.ఉదయం 6:00 గంటల నాటికి రిజర్వాయర్ నీటిమట్టం 307.53 మీటర్లుగా నమోదైంది. పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 8.012 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. మొత్తం సామర్థ్యం 27.55 టీఎంసీలు. రిజర్వాయర్‌కు ప్రస్తుతం ఎటువంటి ఇన్‌ఫ్లోలు లేవు. ఎస్‌పైపీ (ూౌ), ఎస్ఆర్ఎస్‌పీ, అలాగే మానేర్, మూలవాగు, ఎఫ్ఎఫ్‌సీ ఇన్‌లెట్ల ద్వారా కూడా వరద నీరు ప్రవేశించడం లేదు.అవుట్‌ఫ్లో పరంగా మొత్తం 180 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇందులో ఆవిరీభవనం (జుఝుజూశీఙ్ఞఅశీఅ) ద్వారా 135 క్యూసెక్కులు, ఎంబీ ద్వారా 45 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్, ప్యాకేజ్-9, ప్యాకేజ్-10, జీసీఎల్ఎస్ తదితర మార్గాల ద్వారా ప్రస్తుతం నీటి విడుదల లేదు. రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లు ఏవీ ఎత్తలేదు. అలాగే రెగ్యులేటర్ గేట్లు కూడా మూసివేసి ఉన్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలు స్థిరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.



# ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం



**ముస్తాబాద్/ ఏప్రిల్ 24 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామానికి చెందిన అతికం హారిక ఇంటర్మీడియట్ రెండో సంవత్సర ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. గీత కార్మిక కుటుంబానికి చెందిన హారిక రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. ఎంపీసీలో ప్రతిభ చూపిన ఈ అమ్మాయి 995/1000 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్ గా నిలిచింది. ఈరోజు గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినికి ఆమె తల్లిదండ్రులకు గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మొహమ్మద్ వాజీద్ , ఏపీఓ ఆనంద్, సెక్రెటరీ, వార్డ్ సభ్యులు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపిన ముస్తాబాద్ ఆర్యవైశ్య సంఘం



**ముస్తాబాద్/ ఏప్రిల్ 24 ప్రజా దివాస్** ఆర్యవైశ్య కులదైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యులంతా రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కులస్తులను కోమట్లను గుర్తించి వారి ఆరాధ్య దైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషదాయకమైన విషయం. ఆర్యవైశ్యులంతా సామాజికముగాను, ఆర్థికముగాను, రాజకీయంగాను ఎదిగి నిరుపేద ప్రజలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని ముస్తాబాద్ పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కూర సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు

# ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**వేములవాడ/ బోయినపల్లి, ఏప్రిల్ – 24 ప్రజా దివాస్**
కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. వేములవాడ మండలం అనుపురం, బోయినపల్లి మండలం విలాసాగర్, జగ్గారావుపల్లి, కొదురుపాకలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు.రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**రైస్ మిల్లుల్లో తనిఖీ**

బోయినపల్లి మండలం విలాసాగర్ లోని సస్య లక్ష్మి, స్వస్తిక్ ఇండస్ట్రీస్, జగ్గారావుపల్లిలోని సుహాస్ అగ్రో రైస్ మిల్లును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# అధునాతన హంగులతో రుద్రంగి నూతన పోలీస్ స్టేషన్

**- శంకుస్థాపన చేసిన డీజీపీ శివధర్ రెడ్డి మరియు విప్ ఆది శ్రీనివాస్**









**రుద్రంగి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 24** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అధునాతన హంగులతో నిర్మించనున్న నూతన పోలీస్ స్టేషన్ భవనానికి రాష్ట్ర డీజీపీ బీ. శివధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతేలతో కలిసి ఆయన భూమి పూజ నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక హంగులతో, కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా ఈ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఈ నూతన భవనం దోహదపడుతుందని డీజీపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పోలీస్ యంత్రాంగానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 1.944 కిలోల నల్ల బెల్లం పట్టివేత

**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజా దివాస్** ఖమ్మం జిల్లా టాస్క్ ఫోర్స్ (డీటీఫ్ ) బృందం, ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం కోనాయగూడెం సమీపంలోని తండా ప్రాంతంలో నల్లబెల్లం అక్రమ రవాణా జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు నెలకొండపల్లి సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నెలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్‌గిరి తండా, కోనాయగూడెం ప్రాంతాల్లో ఐడీ మరియు బెల్లం నిల్వలపై తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో ఒక నల్లబెల్లం కేసును గుర్తించి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కోనాయగూడెం గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాస్ తన ఇంట్లో అక్రమంగా నల్లబెల్లాన్ని తయారు చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, 1.944 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ దాడుల్లో ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి, డిటిఎఫ్ సీఐ కరుణశ్రీ, నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐ రమేష్, ఎస్సై లతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు .అక్రమ మద్యం తయారీకి సహకరించే వారిపై, నల్లబెల్లం నిల్వలు, రవాణా మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.





# శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం

**- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజా దివాస్** తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అహింసా మూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించ డం హర్షించదగ్గ విషయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామం లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమి నాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సంఘం తరఫున స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల ఏప్రిల్ 26న వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్స వాలను కూసుమంచి మండలం లో ఘనంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. అలాగే ఆర్యవైశ్య సమాజంలో ఉన్న నిరుపేదలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా నిరుపేదలకు తక్కువ వడ్డీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచరీ సైదమ్మ– కొండలు, ఉప సర్పంచ్ మారోజు భీష్మ చారి, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పాల్గొన్నారు.

# వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు చేతిపంపు పునరుద్ధరణ

**- లక్ష్మీపురం సర్పంచ్ మ్యాకల లావణ్య జనార్ధన్ రెడ్డి**

**కాల్వ శ్రీరాంపూర్ ఏప్రిల్ 24 ప్రజా దివాస్** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి సమస్య రాకుండా ఉండేందుకు చేతి పంపు పునరుద్ధ నిచ్చినట్లు సర్పంచ్ మ్యాకల లావణ్య జనార్దన్ రెడ్డి అన్నారు శుక్రవారం ముం స్తు జాగ్రత్తగా లక్ష్మీపురం గ్రామంలో చేతిపంపు రిపేరు చేయించారు నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ప్రజల దాహార్తితో పాటు పశువుల దాహార్తి తీర్చేందుకే బోరింగులు రిపేరు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల లావణ్య జనార్దన్ రెడ్డి, ఉప సర్పంచ్ జంగిలి తిరుపతి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొండిల్ల లక్ష్మయ్య, నాయకులు బండ లక్ష్మణ్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

